అంబులెన్స్ లేక అవస్థలు

- పోచంపల్లికి మంజూరైన అంబులెన్స్ మరో జిల్లాకు తరలింపు
- అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అంబులెన్స్ కరువు
- ఇబ్బందుల్లో మండల ప్రజలు


భూదాన్‌పోచంపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భూదాన్‌పోచంపల్లి : మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ సౌకర్యం కరువైంది. రోడ్డు ప్రమాదం జరిగినా, ఇంకేదైన ఆపదొస్తే హైదరాబాద్‌కు వెళ్లడానికి అంబులెన్స్ లేక మండల ప్రజలు, రోగులు నానా అవస్థలు పడుతున్నారు. అంబులెన్స్ లేని కారణంగా రోగులను ఇతర వాహనాల్లో తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఇప్పటికే ఎందరో ప్రాణాలొదిలారు. అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ డబ్బులు చెల్లించలేకపోతున్నామని పేదలు వాపోతున్నారు.

వాహనం మంజూరైనా..

జిల్లాలో భూదాన్‌పోచంపల్లి, గుండాల మండలానికి కొత్తగా అంబులెన్స్‌లు మంజూరయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 6న హైదరాబాద్‌లో అంబులెన్స్‌లను లాంఛనంగా ప్రారంభించింది. ఉన్నతాధికారులు కూడా పోచంపల్లికి అంబులెన్స్ మంజూరైందని త్వరలో పంపిస్తామని మండల వైద్యాధికారిణికి ఫోన్ ద్వారా తెలిపారు. కానీ, ఆరు నెలలు గడిచినా అంబులెన్స్ మాత్రం రాలేదు. ఇటీవల కలెక్టర్ హనుమంతరావు పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా అంబులెన్స్ సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే కలెక్టర్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. అయితే భూదాన్‌పోచంపల్లి మండలానికి మంజూరైన అంబులెన్స్ మరో జిల్లాకు తరలివెళ్లినట్లు తెలిసింది.

51వేల జనాభా ఉన్నా అంబులెన్స్ లేదు!

పోచంపల్లి మండలంలో మొత్తం 51వేల జనాభా ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని పోచంపల్లిలో విలీన ముక్తాపూర్, రేవనపల్లి గ్రామాలను కలుపుకొని 17,010 జనాభా, 21 గ్రామపంచాయతీలలో 33,987 జనాభా ఉంది. పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోజుకు వందకుపైగా ఓపీ రోగులు వస్తున్నారు. అలాగే పీహెచ్‌సీ పరిధిలో 9 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడికి కూడా పదుల సంఖ్యలో రోగులు వస్తుంటారు. పోచంపల్లి మండలం హైదరాబాద్‌కు సమీపంలో ఉండడం.. పట్టణీకరణ వేగంగా జరిగి ప్రజల వైద్య సేవలు కూడా గణనీయంగా పెరిగాయి. అయితే గర్భిణులు పోచంపల్లికి రావాలన్నా, పోవాలన్న, ఇటు సమీపంలో ఉన్న చౌటుప్పల్, భువనగిరి, హైదరాబాద్‌కు వెళ్లాలన్నా అంబులెన్స్ సౌకర్యం అనివార్యమైనా మండలానికి అంబులెన్స్ లేకుండా పోయింది.

పేదలు ఇబ్బంది పడుతున్నారు



అంబులెన్స్ సౌకర్యంలేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా అత్యవసర వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాలంటే ప్రైవేట్ అంబులెన్స్‌ల వారు వేల రూపాయలు తీసుకొంటున్నారు. మున్సిపాలిటీ కేంద్రమైన పోచంపల్లికి అంబులెన్స్ లేకపోవడం దురదుష్టకరం. వెంటనే అంబులెన్స్‌ను కేటాయించాలి.

– కొండమడుగు రామేశ్వర్, ముక్తాపూర్

మంజూరు చేశారు .. మరిచారు



గత ఏడాది ప్రజాపాలన ఉత్సవాల సందర్భంగా పోచంపల్లికి అంబులెన్స్ మంజూరైందని పంపిస్తామని హైదరాబాద్ నుంచి అధికారి ఫోన్‌చేసి చెప్పారు. కానీ, ఇంతవరకు పంపించ లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పోచంపల్లికి అంబులెన్స్ చాలా అవసరం ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి మరోసారి తీసుకెళ్తాం.

– శ్రీవాణి, మండల వైద్యాధికారిణి, భూదాన్‌పోచంపల్లి

పంటల మార్పిడి పద్ధతి పాటించాలి


భువనగిరి : బొమ్మాయిపల్లిలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్


బొమ్మలరామారం : మసిరెడ్డిపల్లిలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న శాస్త్ర వేత్తలు, రైతులు

- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

భువనగిరి : పంటల మార్పిడి పద్ధతి పాటించి సుస్థిర ఆదాయం పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం భువనగిరి మండలం బొమ్మాయిపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.అనంతరం పంటల సాగు పద్ధతులపై శాస్త్రవేత్త మధుశేఖర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకటరావు, జూనియర్ పశువైద్యాధికారి దుర్గ, భూగర్భనీటి శాఖ సహాయ ఇంజనీర్ నాగ అశ్విత్, పీఎస్ హెచ్ఎం స్వామి, ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మాజీ కౌన్సిలర్ వేణురెడ్డి పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

బొమ్మలరామారం : యూరియా వాడకం తగ్గిస్తే నేలతల్లి ఆరోగ్యం కాపాడుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు శకుంతలాదేవి, తేజశ్విని, ఉపేందర్‌రెడ్డి, శ్వేత, లక్ష్మీపూజ, భారతి అన్నారు. బొమ్మలరామారం మండలంలోని మసిరెడ్డిపల్లి, తిర్మలగిరి, తూంకుంట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ర్యాలీ నిర్వహించి రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసెర్చ్ స్కాలర్ సుష్మ, మాజీ ఎంపీటీసీ ఫక్కీరు రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటేష్, మౌనిక రెడ్డి, సింహ ప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

తుర్కపల్లి : పంట భూముల్లో పచ్చిరొట్ట సాగుతోనే భూసారం పెరుగుతుందని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ చైతన్య అన్నారు. బుధవారం ముల్కలపల్లి, తిర్మలాపురం గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాగు పద్ధతులపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమ్యశ్రీ, అరుణకుమారి, అనిలాకుమారి, దివ్య, జెస్సిక, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పెద్దరావులపల్లి, జిబ్లక్‌పల్లి గ్రామాలలో బుధవారం రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ రాజయ్య, డాక్టర్ మల్లయ్య పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏట శైలజ, మాజీ సర్పంచ్‌లు మట్ట బాలమణి సుదర్శన్, ఆర్ల వెంకటేశం, మాజీ ఎంపీటీసీ బుచ్చయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


ఆలేరులో ప్రచారం ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

రాజాపేట, ఆలేరురూరల్, తుర్కపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముక్కర్ల యాదయ్య, మెతుకు సైదులు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎంరోల్‌మెంట్‌పై టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కళాజాతా బుధవారం రాజాపేట మండలం రఘునాథపురం, ఆలేరు, తుర్కపల్లిలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రచార ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటచారి, ఆడిట్ కమిటీ కన్వీనర్ కర్ణాకర్, సభ్యులు సిద్దులు, జిల్లా నాయకులు వెంకన్న, రవి, ఉప్పలయ్య, నరేష్, ఆలేరు మండల అధ్యక్షుడు భిక్షమయ్య, ఋషి, వెంకన్న, రవికుమార్, శ్రీనివాస్, జహంగీర్, వెంకట్‌గౌడ్, ఎండి సయ్యద్, అంజయ్య, బాలరాజు, అఖిల్, సుదర్శన్ పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలి

మోత్కూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ పాఠశాలల్లోకే పంపాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంపునకు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ప్రచార జాతా బుధవారం సాయంత్రం మోత్కూరుకు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన కాటం శివాని, దేవినేని అర్చన, ఎడ్ల అక్షయశ్రీలను సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు, విద్యా కమిటీ చైర్మన్ దబ్బెటి శైలజ, పలువురు నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇద్దరికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న రవికుమార్

బీబీనగర్: మండలంలోని రావిపహాడ్‌తండాకు చెందిన బానోతు రవికుమార్ ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ పీహెచ్‌డీని సాధించాడు. దీంతో బుధవారం తనకు యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు పట్టాను అందజేశారు. ఎఫిసెంట్ ఫ్రేమ్ వర్క్ ఆఫ్ క్రాప్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై పరిశోధన చేసి రవికుమార్‌కు పీహెచ్‌డీ పట్టా రావడం పట్ల తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.


డాక్టరేట్ అందుకుంటున్న బొబ్బల జ్యోతి

మోటకొండూరు : మోటకొండూరు వాసికి డాక్టరేట్ లభించింది. మోకొండూరుకు చెందిన బొబ్బల జ్యోతి భౌతిక శాస్త్రంలో క్యారెక్టరైజేషన్ ఆఫ్ మెటీరియల్ యూజింగ్ ముల్లర్ మెట్రిక్ ఫార్మలీజం, స్టోక్స్ వెక్టార్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను జేఎన్‌టీయు పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రకటించింది. ఇటీవల జెఎన్‌టీయు హైదరాబాద్‌లో నిర్వహించిన 13వ స్నాతకోత్సవంలో జ్యోతికి తెలంగాణ రాష్ట్ర గొవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా డాక్టరేట్ పట్టాను అందజేశారు. జ్యోతి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందనలు తెలియజేశారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు


ధర్మారంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అడ్డగూడూరు : రైతుల భూ సమస్యల పరిష్కారానికే కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం అడ్డగూడూరు మండలం ధర్మారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో తహసీల్దార్ శేషగిరిరావు, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, వైస్ చైర్మన్ చేడె చంద్రయ్య, మార్కెట్ డైరెక్టర్లు లింగాల నర్సిరెడ్డి, బాలెంల విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, డీటీ నర్సింహారావు, ఆర్ఐ రాజేష్ పాల్గొన్నారు.

భువనగిరి : మండలంలోని పగిడిపల్లి, వడపర్తి గ్రామాల్లో బుధవారం నిర్వహించి సదస్సుల్లో తహసీల్దార్ అంజిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

మోత్కూరు : మోత్కూరు మండలం అనాజిపురంలో రెవెన్యూ సదస్సును మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య పర్యవేక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.జ్యోతి, డీటీ ఉపేందర్ ఉన్నారు.

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలం పీపల్‌పహాడ్,ఎస్.లింగోటం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సుల్లో తహసీల్దార్ వీరాబాయి, డీటీ సిద్ధార్థ, ఆర్ఐ బాణాల రాంరెడ్డి, సర్వేయర్ మురళీధరన్, సీనియర్ అసిస్టెంట్ పి.శ్రీలక్ష్మీ పాల్గొన్నారు. ఎస్.లింగోటం గ్రామంలో టిప్పన్ ప్రకారం హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉప్పు కృష్ణ డీటీకి వినతి పత్రం అందజేశారు.

తుర్కపల్లి : తుర్కపల్లి మండలం కొండాపురం, శ్రీనివాసపురం రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ దేశ్యానాయక్, డీటీ తహసీల్దార్ కల్పన, ఆర్ఐలు జహంగీర్, రఘురామారావు పాల్గొన్నారు.

ఆలేరురూరల్: మండలంలోని మంతపురిలో జరిగిన సదస్సులో తహసీల్దార్ ఆంజనేయులు, డీటీ ప్రదీప్, ఆర్ఐ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

రాజాపేట : బసంతపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ అనిత, డీటీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్ఐలు రమేష్, నర్సింహులు పాల్గొన్నారు. అలాగే గుండాల మండలంలోని పెద్దపడిశాల, అంబాల, బీబీనగర్ మండలం రహీమ్‌ఖాన్‌గూడెం, అన్నంపట్ల, భూదాన్‌పోచంపల్లి పరిధిలోని రేవనపల్లి, జలాల్‌పురం, బొమ్మలరామారం మండలంలోని మైసిరెడ్డిపల్లి, బండకాడిపల్లిలో సదస్సులో ఆయా మండలాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ హనుమంతరావు


నాగారంలో మాట్లాడుతున్న కలెక్టర్

వలిగొండ : రైతుల భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించే భూభారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. రెండో రోజులో భాగంగా బుధవారం వలిగొండ మండలం నాగారం, చిత్తపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారంలో కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. నాగారంలో 15, చిత్తపురంలో 2 అర్జీలు వచ్చాయి. సదస్సుల్లో తహసీల్దార్ దశరథ, డీటీ పల్లవి, రెవెన్యూ అధికారులు మనోహర్, కర్ణాకర్ రెడ్డి, నాగేష్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ పనుల పరిశీలన

మోత్కూరు : మోత్కూరులో ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా జరుగుతున్న ఫుట్‌పాత్ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

ఉత్తమ పాఠశాలగా ఎంపిక

బీబీనగర్: మండలంలోని మక్తా అనంతారం గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాల జిల్లాలోని బెస్ట్ ప్రాక్టీస్ కింద ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రామరాజు బుధవారం తెలిపారు. ఉత్తమ అభ్యాసంలో భాగంగా పాఠశాల ఎంపికైనట్లు పేర్కొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి


బీజేపీ పట్టణ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంకినేని వెంకటేశ్వరరావు

మోత్కూరు : కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారంతోపాటు బీజేపీని బలోపేతం చేసే గురుతర బాధ్యత పార్టీ కార్యవర్గాలపైనే ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. బీజేపీ మోత్కూరు పట్టణ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక ఆర్యవైశ్య భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశంలో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ఈ నెల 6 నుంచి ఆగస్టు 15 వరకు చేపట్టే కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఇందరమ్మ ఇళ్ల మంజూరులో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కాప రవి, కోకన్వీనర్ కూరాకుల వెంకన్న, పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, జిల్లా నాయకులు కె.నాగార్జున్‌రెడ్డి, గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, పట్టణ నాయకులు సజ్జనం మనోహర్, ఏనుగు జితేందర్‌రెడ్డి, ఎడ్ల రాము, తిరుమలేష్, కందుకూరి ప్రకాష్, బీసు మధు, ఉషారాణి తదితరులున్నారు.

బీజేపీ పట్టణ నూతన కార్యవర్గం :

ముందుగా బీజేపీ మోత్కూరు పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా చాడ మంజుల, ఉపాధ్యక్షులుగా మరాటి విజయలక్ష్మి, కందుకూరి ప్రకాష్, ఆరె శ్రీను, కొత్తకొండ ఉషారాణి, ప్రధాన కార్యదర్శులుగా జినుకల దశరథ, అన్నెపు సత్యనారాయణ, కార్యదర్శులుగా తీగల శ్రీధర్ గౌడ్, వనం రేణుక, బీసు మధు, ముత్తినేని తిరుమలేష్, కోశాధికారిగా మాదు సోమేశ్వరిలతో పాటు 34 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

రావి నారాయణరెడ్డి సేవలు మరువలేనివి


మోత్కూరులో రావి నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : దివంగత ఎంపీ రావి నారాయణరెడ్డి భువనగిరి ప్రాంతానికి చేసిన సేవలు మరువలేనివని సీపీఐ నాయకులు అన్నారు. నారాయణరెడ్డి జయంతి సందర్భంగా బుధవారం భువనగిరిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య పట్టణ కార్యదర్శి రమేష్, రాములు పాల్గొన్నారు.

మోత్కూరు : మోత్కూరులోని కేఆర్ భవనంలో రావి నారాయణరెడ్డి జయంతి ని నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, సహాయ కార్యదర్శి యాదగిరి, చాపల అంజయ్య, లక్ష్మీనర్సయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట సీపీఐ కార్యాలయం వద్ద బుధవారం రావి నారాయణరెడ్డి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట : రామన్నపేటలో నిర్వహించిన రావి నారాయణరెడ్డి జయంతిలో నాయకులు యానాల దామోదర్‌రెడ్డి, ఊట్కూరి నర్సింహ, శివరాత్రి సమ్మయ్య, బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంతం, వీరమల్ల ముత్తయ్య, గంగాపురం వెంకటయ్య, రచ్చ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : వలిగొండలో నిర్వహించిన నారాయణరెడ్డి జయంతిలో నాయకులు బోధ సుదర్శన్, పోలెపాక యాదయ్య, రవీందర్, సుదర్శన్, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

మోటకొండూరు : మండల కేంద్రంలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, మండల కార్యదర్శి మాణిక్యం పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలకేంద్రంలో జరిగిన నారాయణరెడ్డి జయంతిలో ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి వెంకటేశం, లాల్‌రెడ్డి, నర్సయ్య, పురుషోత్తం, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందించాలని ధర్నా


డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఆలేరురూరల్ : రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ముందస్తుగా అందించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఇక్కిర సహదేవ్, మామిడాల సోమయ్య, కల్లెపు అడివయ్య, చిరబోయిన రాజయ్య, కుమార్, రాఘవరెడ్డి, బర్మబాబు, సీత, పద్మ సుదర్శన్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇద్దరు సభ్యులు తొలగింపు

మోత్కూరు : మోత్కూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు సభ్యులైన ఆరె శ్రీను, నీల ఉప్పలయ్యలను సంఘం నుంచి తొలగిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మన్నె భీమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు

మోటకొండూరు : నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఏడీఏ పద్మావతి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువు షాపులను జిల్లా అంతర్గత విత్తన తనిఖీ బృందం సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మావతి స్టాక్ రిజిస్టర్లు, విత్తన ప్యాకెట్లపై గత వివరాలను పరిశీలించి మాట్లాడారు. తనిఖీల్లో మోత్కూరు, ఆత్మకూరు ఏఓలు పూజ, కీర్తి, ఏఎస్ఐ రాములు, కానిస్టేబుల్ లక్ష్మీ నారాయణ ఉన్నారు.

ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

తుర్కపల్లి : మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పోగుల ఆంజనేయులు, పలుగుల నవీన్ కుమార్, ఉమారాణి, బద్దునాయక్, బాలకిషన్, భాస్కర్ నాయక్, మల్లప్ప, శ్రీకాంత్, యాదగిరి, శ్రీనువాస్, రమేష్ రాజయ్య, పుట్ట సాయిలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుర్కపల్లి : మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరుమ్మతుల కారణంగా వెంకటాపురం లైన్‌లో దత్తాయిపల్లి, వేల్పుపల్లి, కోనాపురం, ఇబ్రహీంపురంఎన్‌జీ బండల్, గంధమల్లలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరపరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైస్ మిల్లుల్లో ప్లాస్టిక్ బియ్యం లేవు

చౌటుప్పల్ : రైస్ మిల్లుల్లో ప్లాస్టిక్ బియ్యం లభించినట్టుగా జరుగుతన్న ప్రచారంలో వాస్తవం లేదని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని మహాలక్ష్మి రైస్‌మిల్, సత్యనారాయణ మిల్, గోవర్ధన్ రైస్‌మిల్లులను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మిల్లుల్లో ప్లాస్టిక్ బియ్యం ప్రచారం నిజంకాదన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

రామన్నపేట : కేంద్ర ప్రభుత్వం వరి, పత్తి పంటలకు మద్దతు ధరలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు బుధవారం రామన్నపేటలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నకిరేకంటి మొగులయ్య, రాష్ట్రకమిటీ సభ్యుడు వనం అంజయ్య, మండల అధ్యక్షుడు బండ మధుకర్‌రెడ్డి, నాయకులు కంభంపాటి శివరంజన్, బట్టి రమేష్, జంగిలి సత్యనారాయణ, ఐలయ్య పాల్గొన్నారు.

కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


కుమ్మరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

చౌటుప్పల్ : కుమ్మరుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.100 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. చౌటుప్పల్‌లోని తంగడపల్లిలోని కుమ్మరి వృత్తిదారుల ఇళ్లను బుధవారం ఆయన సందర్శించి కుండల తయారీని పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింహ్మా, రాములు, రెహమాన్, అంజయ్య తదితరులు ఉన్నారు.

సీఎం సభా ఏర్పాట్లు ముమ్మరం

తుర్కపల్లి : మండలంలోని తిర్మలాపురం గ్రామ శివారులో ఈ నెల 6న జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చకచకా చేసేస్తున్నారు. 30 ఎకరాల విస్తీర్ణంలో వేదిక పనులు కొనసాగుతున్నాయి. 10 గుంటల స్థలంలో హెలిపాడ్ నిర్మించారు. నాలుగు రెయిన్ ప్రూప్ టెంట్లు, నాలుగు ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు. వాసాలమర్రి, తిర్మలాపురం, వీరారెడ్డిపల్లి వైపు రెండు చోట్ల సభ స్థలం వద్ద వీఐపీలకు పార్కింగ్, నాలుగు వైపుల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.


కొనసాగుతున్న వాటర్ ప్రూఫ్ టెంట్ల పనులు

క్లుప్తంగా

స్పీకర్‌ను కలిసిన ప్రభుత్వ విప్


ప్రసాద్ కుమార్‌ను సన్మానిస్తున్న ఐలయ్య

యాదగిరిగుట్ట: రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బుధవా రం హైదరాబాద్‌లోని ఆయన నివా సంలో కలిశారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి, యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేసి, పట్టుశాలువాతో సన్మానించారు. అనంతరం ఈ నెల 6న తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు హాజరు కావాలని కోరారు.

నగదు బదిలీ పథకం ప్రారంభించాలి

భువనగిరిటౌన్ : గత అసెంబ్లీ ఎన్నికల ముందు గొల్ల కుర్మలకు ఇస్తామన్న రూ.రెండు లక్షల నగదు బదిలీ పథకం వెంటనే ప్రారంభించాలని గొర్రెలు, మేకల పెంపందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరిలోని టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన ఆ సంఘం భువనగిరి మండల సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దేవునూరి బాలయ్య, పాక జహంగీర్, పర్వతి దశరథ, ఉడుత ఆంజనేయులు, తోటకూర అశోక్, వద్దె జమదగ్ని, కడారి కృష్ణ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

ఆత్మకూరు(ఎం) : తుర్కపల్లి మండలం తిర్మలాపురంలో ఈ నెల 6న జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి కోరారు. బుధవారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, నాయకులు తండ శ్రీశైలం, బత్తిని ఉప్పలయ్య, మామిడి మోహన్‌రెడ్డిపాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో రాణించాలి


ట్రోఫీని అందజేస్తున్న సత్యనారాయణ

రామన్నపేట : యువకులు క్రీడాపోటీల్లో రాణించాలని గరిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గరిక సత్యనారాయణ అన్నారు. బుధవారం రామన్నపేట మండలకేంద్రంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన ఉత్తటూరు జట్టుకు ట్రోఫీతో పాటు రూ.50వేల ప్రైజ్‌మనీ అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ


బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని భీమనపల్లి గ్రామంలో బుధవారం బొడ్రాయిపండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, హవనం, యంత్రప్రతిష్ట, బొడ్రాయి ప్రతిష్ట, పోతరాజు ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం మహిళలు బిందెలలో జలాలను తీసుకొని వచ్చి బొడ్రాయికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంటి రాములు, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ మర్రి రాజిరెడ్డి, అనిరెడ్డి జగన్‌రెడ్డి, కంటి లింగస్వామి, సిలువేరు శేఖర్, కందాడి రఘుమారెడ్డి, కొండల్‌రెడ్డి, చంద్రవాస్‌రెడ్డి, కల్క్యూరి పాండు, ఆదిమూలం శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలకే పరిమితం చేయొద్దు

యాదగిరిగుట్ట : ఆలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో శంకుస్థాపన చేయడాన్ని స్వాగతిస్తున్నామని, వాటిని శంకుస్థాపనలకే పరిమితం చేయకుండా వెంటనే పూర్తిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ పాపట్ల నరహరి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతకు పేరు వస్తుందనే కుట్రతోనే గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మించిన కొత్త భవనాలను ప్రారంభించడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు పేరబోయిన సత్యనారాయణ, ఆరె శ్రీధర్‌గౌడ్, దండబోయిన వీరేశం తదితరులు ఉన్నారు.